# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 10, జూన్ 2026




## దిందాలో పోడు రైతుల గోడు..

# పోడు రైతులకు, అటవీశాఖ అధికారులకు మధ్య ఘర్షణ

**చింతలమానేపల్లి జూన్ 09, ప్రభాతవార్త**

కొమురం భీం జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామంలో మంగళవారం పోడు భూముల వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అటవీ పునరుద్ధరణలో భాగంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేందుకు పోడు భూముల్లోకి వెళ్లగా స్థానిక రైతులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. అటవీ శాఖ వాహనాలకు అడ్డంగా రైతులు పడుకుని నిరసన తెలిపారు. మహిళలు, వృద్ధులని చూడకుండా అధికారులు తమపై లాఠీఛార్జ్ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న అధికారులు కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయానికి తరలించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలివ్వాలని, న్యాయం జరిగే వరకు పోరాడతామని రైతులు స్పష్టం చేశారు. ముందస్తు చర్యగా గ్రామంలో భారీగా అటవీ సిబ్బందిని మోహరించారు.



### ఆక్రమిస్తే కఠిన చర్యలు: కర్జవెల్లి రేంజ్ అధికారి సుభాష్

కాగజ్‌నగర్ అటవీ విభాగం కర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా, మిగతా 2లో..



# రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి

✪ నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, జూన్ 09, ప్రభాతవార్త**



రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని, ఎరువులు, విత్తనాలపై అధిక ధరలు వసూలు చేయవద్దని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువులు, విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను పరిశీలించి, ఆ వివరాలను ఆన్‌లైన్ రికార్డులతో సరిపోల్చారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులన్నీ పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు అమ్మవద్దని హెచ్చరించారు. నిర్దేశించిన ధర కంటే ఎక్కువ వసూలు చేయరాదని, కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసిల్దార్ సంతోష్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాసరలో విషాదం..

## గోదావరిలో మునిగి ముగ్గురు అన్నదమ్ములు మృతి



- **కన్నతండ్రి కళ్ళముందే.. కొడుకుల దుర్మరణం**
- **హైదరాబాదు నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చి అనంత లోకాలకు..**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9 ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసరలో గోదావరి నదిలో జరిగిన దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. సెలవు రోజు కుటుంబంతో ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో గోదావరి తీరానికి వెళ్లిన వారు స్నానానికి దిగగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకరిని కాపాడబోయి ఒకరి తరువాత ఒకరు ఇలా ముగ్గురు నీటిలో దిగి గల్లంతయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాసరలోని త్రిబుల్ ఐటీ ఇంటెక్ వాల్ సమీపంలో గోదావరి నదిలోకి దిగిన ముగ్గురు అన్నదమ్ములు లోతైన నీటిలోకి వెళ్లడంతో ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యారు. గల్లంతైన వారిని చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేష్ కుమార్ (31)గా గుర్తించారు. వీరు హైదరాబాద్ కాచిగూడ చెప్పల్ బజార్ నుండి సరస్వతి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే ఏఎస్పి సాయికుమార్ ఆధ్వర్యంలో, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన గాలింపులో తొలుత మృతదేహాలు లభించలేదు. అనంతరం స్థానిక గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టిన గాలింపులో ముగ్గురు అన్నదమ్ముల మృతదేహాలు వెలికి తీశారు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని కలచివేశాయి. ముగ్గురు కుమారుల మృతితో వారి తండ్రి రోధించిన తీరు పలువురు కంటతడి పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే వారు బాసరకు చేరుకుని గోదావరి తీరంలో బోరున విలపించారు. ఈ ఘటనతో ప్రాంతమంతా విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బాసర సీఐ దీపక్ తెలిపారు. ఇద్దరి కుమారులకు వివాహం కాగా చిన్న కుమారుడికి వివాహం కాలేదని మృతుల తండ్రి తెలిపారు. మృతుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ హెచ్ ఓ తెలిపారు. ఈ ఘటన నదుల్లో స్నానానికి వెళ్లే సమయంలో అప్రమత్తత ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసింది. వర్షాకాలంలో నదుల ప్రవాహం, లోతు అంచనా వేయడం కష్టమవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ అవసరం

## పిల్లల విద్యాహక్కు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి - తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా కన్వీనర్ పేరం అలేఖ్య నటేశ్వర్

**మంచిర్యాల, జూన్ 9, ప్రభాతవార్త**



ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం తల్లిదండ్రుల బాధ్యత అయినప్పటికీ, ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులు తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారంగా మారుతున్నాయని న్యాయవాది పేరం అలేఖ్య పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని విద్యాహక్కు నిబంధన ప్రకారం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి చిన్నారికి ఉచిత, నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆమె గుర్తు చేశారు. అలాగే విద్యాహక్కు చట్టం ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రూపొందించబడిందని తెలిపారు. అయితే ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కొందరు తల్లిదండ్రులు తమ పొదుపులను ఖర్చు చేయాల్సి వస్తుండగా, మరికొందరు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణలో సమర్థవంతమైన మార్పులు తీసుకురాకపోతే విద్యాహక్కు కేవలం కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నిర్మాణాన్ని పరిశీలించి నియంత్రించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా కన్వీనర్ పేరం అలేఖ్య డిమాండ్ చేశారు. న్యాయవాది కొట్టే నటేశ్వర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి చిన్నారికి అందుబాటులో, నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘన సన్మానం

**మందమర్రి, జూన్ 09, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థకు చెందిన మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న పలువురు ఉన్నతాధికారులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, అన్ని విభాగాల అధిపతులు (హెచ్ఓడి) ఆధ్వర్యం వహించారు. కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా సేవలందించి, రామగుండం ఏరియాకు జీఎం (సేఫ్టీ)గా పదోన్నతిపై బదిలీ అయిన మల్లయ్యను, అలాగే మందమర్రి ఏరియా సీనియర్ పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేసి భూపాలపల్లి ఏరియాకు బదిలీ అయిన వంశీని ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ మందమర్రి ఏరియా అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో బదిలీపై వెళ్తున్న అధికారులు అందించిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. వారు తమ నూతన బాధ్యతల్లో కూడా మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.ఎల్. ప్రసాద్, నూతన కేకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, కే.కే గ్రూప్ ఏజెంట్ ఖదీర్, మందమర్రి ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొని బదిలీపై వెళ్తున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## జర్మన్ భాషా శిక్షణతో విదేశీ ఉపాధి అవకాశాలు

**- జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**మందమర్రి, జూన్ 09, ప్రభాతవార్త**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల ఇల్లందు క్లబ్ లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, జర్మనీ తో పాటు ఇతర యూరోపియన్ దేశాలలో ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని, జర్మన్ భాషలో ప్రాథమిక, మధ్యస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు సన్నద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాలపై ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## దిందాలో పోడు రైతుల గోడు.. పోడు రైతులకు, అటవీశాఖ అధికారులకు మధ్య ఘర్షణ

**(మొదటిపేజీ తరువాయి)**

బండపల్లి బీట్లలో ఆక్రమణకు గురైన 1600 ఎకరాల అటవీ భూమిలో. గత ఏడాది ప్రత్యేక చర్యలు చేపట్టి 800 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి సుభాష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిలో అటవీ పునరుద్ధరణ, నేలతేమ పరిరక్షణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. అయితే దిమ్మ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమకు పట్టా భూములు ఉన్నప్పటికీ, అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ అటవీ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, అటవీ సంపద రక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 108 అంబులెన్స్ సేవలపై ఆకస్మిక తనిఖీ

### - అత్యవసర సేవలో నాణ్యత పెంపుపై అధికారుల దృష్టి

**వేమనపల్లి, జూన్ 9, ప్రభాతవార్త**



వేమనపల్లి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 108 అంబులెన్స్ ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అంబులెన్స్ వాహనం పనితీరు, అందులోని వైద్య పరికరాలు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే మెడికల్ ఎక్విప్‌మెంట్, మందుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా 108 అంబులెన్స్ జిల్లా అధికారి కొండలరావు, ఈఎంటీ జాడి స్వరూప, పైలట్ ఇమామ్ షరీఫ్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.16.43 లక్షల ప్యాకేజీతో సింగరేణి విద్యార్థినికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

### - హెచ్ఎస్‌బీసీ బ్యాంకులో కొలువు సాధించిన అక్షయ

**నస్పూర్, జూన్ 9, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థిని మంచాల అక్షయ అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థ హెచ్ఎస్‌బీసీలో రూ.16.43 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించింది. కళాశాలలో సివిల్ డిప్లొమా పూర్తి చేసిన అక్షయ ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఈ భారీ ప్యాకేజీతో కొలువు సొంతం చేసుకుంది. అక్షయ 2020-2023 విద్యాసంవత్సరంలో శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో సివిల్ డిప్లొమా కోర్సు పూర్తి చేసింది. అనంతరం 2023-2026లో కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలను సందర్శించిన అక్షయ తన విజయానికి సహకరించిన అధ్యాపకులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపింది. భారీ ప్యాకేజీతో అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం సాధించిన అక్షయను పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్, డీజీఎం డినీల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.





డ్రైనేజీ పనుల భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్, నాయకులు

## డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ

**తాండూర్, జూన్ 9, ప్రభాతవార్త**

మండలం గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో డ్రైనేజీ పనులకు మంగళవారం సర్పంచ్ ఘాట్ నరసయ్య భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఉప సర్పంచ్ సునీత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.



బీర్సా ముండా చిత్రపటానికి నివాళులార్పిస్తున్న నాయకులు

## బీర్సా ముండా ఆశయాలు యువతకు స్ఫూర్తి

**పెంచికల్ పేట్, జూన్ 9, ప్రభాతవార్త**

మండలంలోని మురళీగూడ గ్రామంలో ఆదివాసీల మహానాయకుడు బీర్సా ముండా 126వ వర్ధంతిని తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుడ్మేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం బీర్సా ముండా చేసిన పోరాటం స్ఫూర్తిదయాకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, చిన్ను, బిక్షపతి, భాస్కర్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



బోరింగ్ పనులకు భూమి పూజ చేసిన నాయకులు

## బోరింగ్ నిర్మాణానికి భూమి పూజ

**తాండూర్, జూన్ 9, ప్రభాతవార్త**

మండలంలోని మాదారంలో నూతన బోరింగ్ నిర్మాణ పనులకు మంగళవారం సర్పంచ్ కృష్ణ పల్లి లక్ష్మణ్, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బోరింగ్ వేయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చమన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో బోరింగ్ కోసం డిఎంఎఫ్టి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నీలాయపల్లి సర్పంచ్ పోలవేణి తిరుపతి, ఉప సర్పంచులు సూరం దామోదర్ రెడ్డి, రాపల్లి సతీష్, వార్డు సభ్యులు కత్తర్ల రవి, నాయకులు శంకర్, కమలాకర్, ఎల్లయ్య రాజా రామ్ చందర్, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సెక్రటరీ ప్రవళికకు ఘన సన్మానం

**దిలావర్‌పూర్, జూన్ 09, ప్రభాతవార్త**

దిలావర్‌పూర్ మండలంలోని బన్సపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ప్రవళికకు మంగళవారం గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామ సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ గడ్డం ముత్యం ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బన్సపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధిలో ప్రవళిక చేసిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అన్ని వర్గాల ప్రజలతో సమన్వయంగా పనిచేసి, పంచాయతీ పరిపాలనను జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిపారని ప్రశంసించారు. అనంతరం ప్రవళిక మాట్లాడుతూ బన్సపల్లి గ్రామంలో విధులు నిర్వహించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు తనను ఒక కుటుంబ సభ్యురాలిలా ఆదరించి అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఉద్యోగరీత్యా బదిలీపై వెళ్లాల్సి రావడం బాధాకరంగా ఉందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో నూతన పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల కల్పన దిశగా చర్యలు

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 9, ప్రభాతవార్త**

విద్యావ్యవస్థలో ప్రణాళికబద్ధమైన మార్పుల ద్వారా విద్యార్థులకు విద్యా బోధన, వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్యతో కలిసి జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. టిజిడబ్ల్యుఐడిసి ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రీ కళాశాలలలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, కళాశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా కృషి చేయాలని, నూతన అడ్మిషన్లు నమోదు చేయాలని తెలిపారు. కళాశాలలో అవసరమైన అధ్యాపకులు, సిబ్బంది నియామకం ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలని తెలిపారు. కళాశాలల నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని, సరైన సమయానికి తరగతులు నిర్వహించాలని తెలిపారు. నూతన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, అడ్మిషన్లతో పాటు హాజరు శాతం పెంచే అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక కోర్సులలో వృత్తివిద్య శిక్షణ అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎటిసిల ద్వారా ఉద్యోగం సంపాదించిన వారి వివరాలను విరివిగా ప్రచారం చేయడం ద్వారా అడ్మిషన్ల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, 90 శాతం హాజరు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధ్యాపకులు నెలలో పూర్తి చేసిన సిలబస్ సంబంధిత రిజిస్టర్ నిర్వహణ, చాప్టర్ వారీగా స్లిప్ టెస్టుల నిర్వహణ,హాజరు శాతం సరిగా లేని విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

## వడ్డెర కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- అనుమానితుల విచారణ వాహనాల తనిఖీలు

నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు స్వాధీనం

**మంచిర్యాల, జూన్ 9, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా రామగుండం సీపీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి వడ్డెర కాలనీలో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో పోలీసు బృందాలు కాలనీలోని పలు ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాయి. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులను విచారించి వారి వివరాలను సేకరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల ప్రవర్తన, ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా తీసి అవసరమైన సమాచారాన్ని నమోదు చేశారు. నేరాల నివారణకు అవసరమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి, వాహనాల పత్రాలు సక్రమంగా లేని వాహనాలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇలాంటి తనిఖీలు నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ, పట్టణ ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్ తరలివెళ్లిన మహిళ అభ్యుదయ సమైక్య ప్రతినిధులు

## హైదరాబాద్ తరలివెళ్లిన మహిళ అభ్యుదయ సమైక్య ప్రతినిధులు

**తాండూర్, జూన్ 9, ప్రభాతవార్త :**

మండలానికి చెందిన ఐకెపి మండల మహిళ అభ్యుదయ సమైక్య ప్రతినిధులు, ఐకెపి ఎపిఎం, సిబ్బంది మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మండలానికి చెందిన మహిళ అభ్యుదయ సమైక్యకు రుణం, సబ్సిడీపై ప్రభుత్వం ఆర్టీసీ బస్సును మంజూరు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాదులో మహిళ సంఘాలకు మంజూరైన ఆర్టీసీ బస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఐకెపి ఎపిఎం శ్యామల తెలిపారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- ఏఎస్ఐ రాజమోళి

**తాండూర్, జూన్ 9, ప్రభాతవార్త :**

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఏఎస్ఐ రాజమోళి అన్నారు. మండలంలోని ఐబిలో మంగళవారం సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆటో డ్రైవర్లకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు రాజు నాయక్, లింగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్ఐ రాజమోళి

## విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రమాదంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, జూన్ 09, ప్రభాతవార్త**

విశాఖ ఉక్కు స్టీల్ ప్లాంట్‌లో 8 తేదీన జరిగిన ఘోర ప్రమాదంలో ల్యాడిల్ పేలిపోవడంతో 9 మంది కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన టిఎన్టియుసి, ఎస్‌సిఎల్‌యు నాయకులు. ప్లాంట్ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి. మణిరామ్ సింగ్ మాట్లాడుతూ ఉత్పత్తి పై చూపుతున్న శ్రద్ధను కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం చూపలేదని విమర్శించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అన్నారు. కాంట్రాక్టు విధానం, అవుట్‌సోర్సింగ్ వల్ల కార్మికుల రక్షణలో లోపాలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ, ఈ విధానాలను తక్షణమే నిలిపివేయాలని కోరారు. అలాగే ప్రమాదంలో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి, వారు కోలుకునే వరకు పూర్తి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి. మణిరామ్ సింగ్, ఎస్సీ ఎల్ యు ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఓ. జీవరత్నం, టిఎన్టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లు మల్లయ్య, కొత్తూరి నారాయణ, ఎం. గోపాల్, పుల్లూరి పోశం, ఎండి అస్గర్ భాష తదితరులు పాల్గొని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.






## బెల్లంపల్లిలో కల్వర్టు నిర్మాణ పనుల పర్యవేక్షణ

**బెల్లంపల్లి, జూన్ 09, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ 19వ వార్డులో మున్సిపాలిటీ గ్రాంట్ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న నూతన కల్వర్టు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బస్తీ ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కల్వర్టు నిర్మాణాన్ని నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, మున్సిపల్ సిబ్బంది, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో స్క్రాప్ దుకాణాలపై తనిఖీలు

**బెల్లంపల్లి, జూన్ 09, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు స్క్రాప్ దుకాణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తూ, కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా జనావాస ప్రాంతాల్లో స్క్రాప్ దుకాణాలు నిర్వహిస్తున్నారని వార్డ్ ప్రజల నుండి ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా దుకాణాలను పరిశీలించగా అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. జనావాసాల్లో ఉన్న స్క్రాప్ దుకాణాలను వెంటనే వేరే ప్రదేశాలకు తరలించాలని దుకాణ యజమానులకు సూచించారు. లేని పక్షంలో శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, జూన్ 09, ప్రభాతవార్త**

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు.

బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. తదుపరి కన్నెపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. వైద్య సేవలను మెరుగుపరచడానికి



ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆసుపత్రికి వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, నెన్నెల మండలంలోని విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.



## మృగశిర కార్తె వేళ వర్షం

### - హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

**సారంగాపూర్, జూన్ 09, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాలలో మృగశిర కార్తె రోజున వరుణుడు కరుణించి వర్షం కురిపించడంతో ఈ వర్షాకాలం శుభదాయకంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మృగశిర కార్తె నాటికి వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో రైతులు ముందుగానే తమ పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకున్నారు. సాధారణంగా మృగశిర కార్తె ప్రవేశించిన తర్వాతే రైతులు విత్తనాలు వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం మండలంలోని మెజారిటీ ఉపాంత, చిన్నకారు రైతులు నమ్మకంతో తమ పొలాల్లో పత్తి విత్తనాలు వేశారు. తొలిరోజే వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.




స్వర్ణ వన సేవకుడు ఆశన్నను అభినందిస్తున్న సర్పంచ్ మల్లేష్, అధికారులు

## స్వర్ణ నర్సరీలో మొక్కల పెంపకం

### - వన సేవకుడికి అభినందనలు

**సారంగాపూర్, జూన్ 09, ప్రభాతవార్త:**

మండలంలోని స్వర్ణ గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలో రాబోయే వర్షాకాలం ప్లాంటేషన్ కోసం వివిధ రకాల మొక్కలను సిద్ధం చేశారు. వర్షాకాలం ప్రారంభం కాగానే గ్రామాల్లోని ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా నాటడానికి ఈ మొక్కలను ఉపయోగించనున్నారు. తీవ్రమైన ఎండలు ఉన్నప్పటికీ వన సేవకుడు అచ్చ ఆశన్న ఎంతో శ్రద్ధతో నర్సరీలోని మొక్కలను పెంచి, నిరంతరం నీరు అందిస్తూ వాటిని కాపాడారు. ఎండాకాలాన్ని తట్టుకుని మొక్కలు పచ్చగా పెరిగేలా శ్రమించిన ఆశన్నను గ్రామ సర్పంచ్ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి, కారోబరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బడిబాటలో భాగంగా గుండంపెల్లిలో కరపత్రాల పంపిణీ

**దిలావర్‌పూర్, జూన్ 09, ప్రభాతవార్త:**

బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండంపెల్లి గ్రామంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం ప్రచార కరపత్రాలను గ్రామ సర్పంచ్ తక్కల రమణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు చొరవ చూపాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. సర్కారు బడుల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సౌకర్యాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, ఇంగ్లీష్ మీడియం బోధన గురించి తల్లిదండ్రులకు వివరించి బడిబాట కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బడిబాట కరపత్రాలను అందజేస్తున్న హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు

## జీతాలు చెల్లించకపోతే ఆందోళనలు తప్పవు

### - ఐఎఫ్‌టీయూ హెచ్చరిక

### - నాలుగు నెలలుగా జీతాలు లేక సులభ్ కార్మికుల అవస్థలు

**మందమర్రి, జూన్ 09, ప్రభాతవార్త**

సింగరేణి ప్రాంతంలోని మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లో పనిచేస్తున్న సులభ్ కార్మికులు గత నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సులభ్ సంస్థ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పిల్లల చదువుల ఖర్చులు భరించలేక కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా, వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం కార్మికులపై అదనపు భారం మోపుతోందన్నారు. ఈ సమస్యపై సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడంతో జీతాల సాధన కోసం దీర్ఘకాలిక ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు మూడు రోజుల్లోపు బకాయి జీతాలను చెల్లించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఎండీ జాఫర్, డివిజన్ నాయకులు ఆర్. అజయ్, ఎస్. కనకయ్య, పి. మహేశ్వరి, పి. సునీత, గణేష్, రాజయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.







## సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ అంటే భయం పట్టుకుంది

### ● రావుల రాంనాథ్

**నిర్మల్, జూన్ 09, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ అంటే భయం పట్టుకుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై, కేంద్రంపై నిందలు వేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన తర్వాతే కేంద్రం సేకరిస్తుందని గుర్తుచేశారు. తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు చేయబోమని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన "రైతు గోస బీజేపీ భరోసా యాత్ర" వల్లే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, రాష్ట్రం ఎవరి జాగీరు కాదని రాంనాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతోనే బీజేపీపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేసినట్లే, రాబోయే ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డిని కొడంగల్‌కే పరిమితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు ముత్యం రెడ్డి, రాచకొండ సాగర్, పొన్నం నారాయణ గౌడ్, జుట్టు దినేష్ తదితరులు పాల్గొన్నారు.


## సీసీటీఎన్ఎస్ 2.0, ఈ సాక్ష్య అమలును వేగవంతం చేయాలి: సీపీ

**మంచిర్యాల, జూన్ 9, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన మే నెల నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కీలక ఆదేశాలు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులు, వారెంట్ల అమలు, మహిళలపై నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదుల విచారణలో పారదర్శకత పాటించాలని, పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ అనవసరంగా పిలవరాదని పేర్కొన్నారు. అలాగే సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల సేకరణ, కేసుల నిర్వహణలో వేగం, పారదర్శకత పెంచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో పెండింగ్ లేకుండా డేటా అప్లోడ్ చేసే సిబ్బందికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. వర్షాకాలంలో వరదలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సీపీ సూచించారు. సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## జొన్న రైతులకు వాన దెబ్బ

**దిలావర్‌పూర్, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ మండల జొన్న రైతుల కష్టాలు ఈ ఏడాది వర్ణనాతీతంగా మారాయి. మండలంలో సుమారు 1418 ఎకరాల్లో జొన్న సాగు చేయగా, రైతులకు ఎకరాకు సుమారు 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం ఎకరాకు కేవలం 10 క్వింటాళ్ల జొన్న మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో, మిగిలిన ధాన్యాన్ని ఎలా విక్రయించాలో తెలియక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం రైతులకు మరో పెద్ద దెబ్బ కొట్టింది. మండల కేంద్రంలోని కల్లాల్లో నిల్వ చేసిన జొన్న ధాన్యం బస్తాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.